# తగిన సంబంధం

"నక్క పుట్టి నాలుగు ఆదివారాలు కాలేదు. ఇంత పెద్ద గాలివానను నేనెప్పుడూ చూడలేదు అందిట. మీ మాటలు వింటూంటే ఆ సామెత గుర్తుకొస్తూన్నాది. మనం ఈ ఊరు వచ్చి ఇంకా పక్షం రోజులైనా కాలేదు. అప్పుడే ఈ ఊరు మహాదొడ్డది, ఈ ఊరివాళ్ళు మంచివాళ్ళు అనే ప్రశంసా పత్రాలు పంచేస్తున్నారు ఈ ఊరిలోనూ, ఈ ఊరివారిలోనూ నాకు కనిపించని మంచితనం మీకేం కనిపించింది?" అంది పార్వతి.

విశ్వనాథరావుకో అలవాటుంది. ఏదైనా విషయంలో తనకంటూ ఒక అభిప్రాయం ఏర్పడితే ఆ అభిప్రాయాన్ని సాధికారికంగా ఇతరులకు చెప్పి అది సరియైనదని నమ్మమంటాడు.

పార్వతి అతని భార్య కనుక ముందుగానే ఆమెతో ఇలాంటి విషయాలు చెప్తూ ఉంటాడు. అసెంబ్లీలో ప్రతిపక్షం సభ్యుడిలా ఆమె అతని వాదాన్ని కొట్టిపారేస్తుంది. నీకు చెప్పడం నాదే బుద్ధి తక్కువనుకుంటాడు. ఇకమీదట మరెవరితోనైనా చెప్పాలికానీ పార్వతితో అసలు అనకూడదు అనుకుంటాడు. కానీ ఆ మాటమీద నిలబడలేని బలహీనుడు విశ్వనాథరావు.

పార్వతి భర్తను అభిమానిస్తుంది. కానీ అతనేదో రహస్యోద్ఘాటన చేసినట్లు చెప్పిన ప్రతీదానికి పూర్వాపరాలు ఆలోచించకుండా తల ఊపదు. విశ్వనాథరావు దంపతులు ఈ ఊరికి రాకముందు విశాఖపట్నంలో ఉండేవారు. గెజిటెడు ఆఫీసరుగా ప్రమోషనిస్తూ అతన్ని ఈ ఊరికి బదిలీ చేశారు. మెట్రోపాలిటన్ సిటీలాంటి విశాఖపట్నంలో అతని ఉనికిని ఎవరూ పట్టించుకునేవారు కాదు. అక్కడిదంతా యాంత్రికజీవితం.

ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానంచేసి కాఫీ సేవిస్తూ పేపరు చూడడం, ఆఫీసువేళ కాగానే భోజనం చేసి ఆఫీసుకి వెళ్ళడం, అక్కడ ఒళ్ళు దాచుకోకుండా పనిచేసి, అలసి సొలసి ఇంటికివచ్చి భార్యాపిల్లలతో ముచ్చటలాడి భోజనంచేసి పక్కమీద వాలడం మినహాయించి మరో వ్యాపకం ఉండేది కాదు. ఆప్యాయతగా పలకరించేవారు కానీ, ఆదరించేవారుకానీ అరుదు.

స్నేహితులైనా, పరిచయస్తులైనా దారిలో తారసిల్లుతే, 'ఓహో అంటే ఓహో' బాగున్నారా అంటే బాగున్నారా' అనో, 'నమస్కారం సార్! చాలా రోజులై దర్శనాలు లేవు. బజారుకి వెళ్తున్నారా? వస్తాను. నాకూ పనివుంది' అని పలకరించడమే కానీ అందులో ఒక ఆత్మీయత ఉండేదా, కష్టం సుఖం తెలుసుకుందాం అనే ఉత్కంఠ ఉందా?

విశ్వనాథరావుకి ఈ ఊరివాళ్ళు ఎంతో ఆత్మీయులుగా కనిపించారు. అతను ఉద్యోగంలో పదవీ బాధ్యతలు స్వీకరించిననాటి నుంచి ఎవరో ఒకరు వచ్చి పరిచయం చేసుకోసాగారు. 'ఈ ఊరు కొత్త అని సంశయించకండి. ఏ అవసరం వచ్చినా మేం ఉన్నాం అన్న మాట మరువకండి' అంటూ

వారు తమ సహాయాన్ని వ్యక్తం చేసేవారు. సంఘజీవి అయిన మానవుడు ఇతరుల నుండి ఆశించేది అదేగా!?

విశ్వనాధరావు వాళ్ళతో కలిసిపోయాడు. ఎవరో ఒకరు విశ్వనాధరావు ఇంటికి రోజూ వచ్చి ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పి పోతుండేవారు. అలాగే అతని ఆఫీసు సిబ్బంది అతని మన్ననలు పొందాలని శాయశక్తులా ప్రయత్నిస్తూ చిన్న చిన్న ఉపకారాలు చేయడానికి ముందుకొచ్చేవారు. వాళ్ళెవరూ తన నుంచి ఏమీ ఆశించడంలేదని, అది ఇక్కడి వాతావరణ ప్రభావమని, ఈ మనుషులు సహృదయులు, ఆత్మీయులు అని అతను అభిప్రాయపడ్డాడంటే అందులో ఆశ్చర్యం లేదు.

ఇతరుల మనసులు చదవడానికి ఒక పదిహేను రోజులు సరిపోవు అని పార్వతి అనుకుంటుంది. ఏ వృక్షమూ లేనిచోట ఆముదపు చెట్టే మహావృక్షంలా చలామణి అవుతుంది. ఈ ఊరిలో గెజిటెడ్ స్థాయిలోని ఉద్యోగులను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అందువలన ముందు ముందు ఏదో లాభం వుండకపోదు అనే దురూహతో వాళ్ళు చెలిమి పెంచుకోవడం లేదన్న నమ్మకం ఏమిటి? విశ్వనాధరావుకి కొత్తగా ఏర్పడిన స్నేహితులతో ఆమెకు ఇబ్బంది కలగసాగింది. రోజూ ఏదో వేళ ఎవరో ఒకరు రావడం వారికి కాఫీ ఫలహారాలు చేసిపెట్టడం ఆమెకు తప్పేవి కావు.

★ ★ ★

"పార్వతీ! ఈ ఊరు మహాదొడ్డదని, ఇక్కడి మనుషులు స్నేహపాత్రులు, తోటివారంటే ప్రాణం పెడతారని అన్నానే,... కానీ మంచివాళ్ళ మధ్య కొందరు దుష్టులుంటారని తెలిసింది" అన్నాడు.

"అయ్యో! పదిహేను రోజులలోనే మీ అభిప్రాయాలు మార్చుకోవలసి వచ్చిందా?"

భార్య మామూలుగా అన్నా అందులో వేళాకోళం వున్నట్లు తట్టింది విశ్వనాధరావుకి. "పార్వతీ! నన్ను పూర్తిగా చెప్పనిస్తావా?" అని భార్య ఇచ్చిన కాఫీ తాగి "నేను ఇంతవరకు పరిచయమైనవాళ్లు మంచివాళ్ళు కారనికానీ, స్వార్థపరులనికానీ, మనముందు మంచిగా ఉన్నా వెనుక గోతులు తవ్వే తత్వం వాళ్ళని కానీ అనడంలేదు.

ఇంతవరకు తారసిల్లినవారు మంచివాళ్ళే. అయితే ఈరోజు మాత్రం ఒక వ్యక్తి తారసపడ్డాడు. అతనికి దూరంగా వుండాలి. లేకుంటే మన పరువు మంటగలిసిపోతుంది" అన్నాడు.

అతనిచ్చిన వివరణ చాలదు. అందుకే భర్త వంక సాలోచనగా చూసింది పార్వతి.

"పార్వతీ! ఈరోజు నాకో వింతమృగం తారసపడింది. సంస్కారం బొత్తిగాలేని అతని పేరు రంగనాధం. నేను చేసిన పాపమల్లా చిన్నతనంలో అతనితో చదువుకోవడమూ ఆడుకోవడమూను" అని చెప్పాడు విశ్వనాధరావు.

"అంటే రంగనాధం అనే బాల్యస్నేహితుడిని ఈరోజు మీరు కలిసేరన్నమాట?"

"ఆ రంగనాధానికి ఎలా తెలిసిందో నేను ఈ ఊరు వచ్చినట్లు, నన్ను వెతుక్కుంటూ నేరుగా మా ఆఫీసుకే వచ్చాడు. నేను లోపల కొందరు పెద్దమనుషులతో మాట్లాడుతున్నాను. సభ్యతైనా కనబరచకుండా వాడు డోర్ తెరుచుకుని వచ్చి 'ఒరే! నువ్వేనా విస్సూ! నువ్వే అయివుంటావనుకున్నాను. ఎన్ని రోజులైంది నువ్వు ఇక్కడకు వచ్చి? మరి ఇంతకాలం నన్ను కలియలేదేం?

ఐనా నా మతి మండ! నీకేం తెలుసు నేనిక్కడ అఘోరిస్తున్నానని. అన్నట్లు నువ్వేదో పనిలో

వున్నట్లున్నావు. ఈ మారు తీరిక చూసుకొని వస్తానులే' అంటూ వచ్చిన వాడు వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు. 'ఎవరండీ! ఈ మిత్రసత్తముందు?' అంటూ నాముందు కూర్చున్నవాళ్ళు అడిగారు. ఏమని చెప్పను పార్వతీ! బెల్లు వాయించి ప్యూన్‌ను పిలిచాను.

'నువ్వు బయట నిద్రపోతున్నావా? బీడి కాల్చుకుంటూ లోకాన్నే మరిచిపోయావా? అతడిని గదిలోనికి ఎలా రానిచ్చావు? నేను కాన్ఫరెన్సులో వున్నానని నీకు తెలియదా?' అని అడిగాను.

'సార్! నేనేం చేయను? నేను అడ్డుపడ్డాను. 'నువ్వెవడివోయ్ మా విస్సుని చూడనివ్వకుండా సైంధవుడిలా అడ్డుపడడానికి? మీ అయ్యగారు ఎవరనుకుంటున్నావు – అతను నా చిన్ననాటి స్నేహితుడు. కలిసి చదువుకున్నాం. కలిసి ఆడుకున్నాం. నీకు తెలుసో తెలియదో, చదువులో నేను చురుకైనవాడిని కాకపోయినా అల్లరి చేయడంలో నాదే పైచేయి. నాతో కలిసి మీ అయ్యగారు చెరువులో ఈతలు కొట్టారు, తాటిచెట్లు ఎక్కారు.

ఒకమారు మేం బంగార్రాజు గారి తోటలో మామిడికాయలు కోస్తూ వుంటే తోటమాలి మా ఇద్దర్నీ పట్టుకున్నాడు. నేనైతే తప్పించుకు పారిపోయాను. పాపం మా విస్సు మాత్రం బాగా దెబ్బలు తిన్నాడు' అంటూ నన్ను పక్కకు నెట్టి మీ గదిలోనికి దూరాడు. సార్! మళ్ళీ అతనొస్తే నేను లోనికి రానీయను సార్!' అన్నాడు.

పార్వతీ వాడు వింతమృగం కాక మరేమిటి? ఇక వేషం చూద్దామా? ఖాకీ యూనిఫారం ధరించి వున్నాడు. నిండా నూనె మరకలు, మట్టి మరకలు. చాలాచోట్ల చిరుగులు, అతుకులు. హవాయి చెప్పులేసుకున్నాడు. తెగిపోయాయి కాబోలు పిన్నీసులు పెట్టాడు. తల చీకేసిన తాటిటెంక లాగుంది. వాడే కనుక మన స్నేహితుడని ఇక్కడివాళ్ళకి తెలిస్తే మనం బ్రతకలేం.

"వాడు కందుకంలాంటివాడు. మనం ఎంత దూరం విసిరితే అంత దగ్గరికొస్తాడు. మన ఇంటికి రాకుండా వుండలేడు. నీవు సభ్యతకైనా అతన్ని లోనికి రానివ్వకు" అన్నాడు విశ్వనాధరావు.

బాల్యస్నేహితుడు కనిపించి ఆప్యాయతగా పలకరించాలనుకున్నాడు. చిన్నతనంలో ఎలా సంబోధించేవాడో అలాగే సంబోధించాడు. ఇప్పుడా మిత్రుడు ఒక ఉన్నత పదవిలో ఉన్నాడని కానీ తన వేషభాషలు ఎలా ఉన్నాయని కానీ ఆలోచించలేదు.

అతడు అమాయకుడై ఉంటాడు. దానికే ఇతను బాధపడుతున్నాడు. అయినా ఆ రంగనాథం అలా ప్రవర్తించి వుండకూడదు. అలా డ్యూటీ బట్టలతో వెళ్ళకుండా మరో మంచి జత బట్టలు వేసుకుని సభ్యతగా కలిసి మాట్లాడి వుండవలసింది అనుకుంది పార్వతి. రంగనాథాన్ని ఇంతవరకు ఆమె చూడకపోయినా అతని తత్వం ఎలాంటిదో అర్థం చేసుకుంది. అతను నిరపకారమైన ప్రాణి.

"పార్వతీ! ఏమిటాలోచిస్తున్నావు? అలాంటి వాళ్ళకు దూరంగా ఉండాలి" అని మరోమారు భార్యను హెచ్చరించాడు. ఆ తర్వాత నాలుగైదురోజులవరకు విశ్వనాధరావు కొత్త చిక్కులలో ఇరుక్కున్నాడు. విశాఖపట్నం లాంటి పట్టణాలలో ఇంతకన్నా పెద్ద పరాభవాలు జరిగినా ఇరుగు పొరుగులు పట్టించుకోరు. ఇదొక చిన్న ఊరు కావడాన అందరూ అతన్ని పరామర్శించసాగారు. అందులో వేళాకోళమే ఎక్కువ ప్రతిధ్వనించింది.

'ఇంకా మీరు సంస్కారవంతులనుకున్నాం. మీకెంత మంచి బాల్యస్నేహితులున్నారు? ఆ రంగడు

మీ స్నేహితుడా? మీరు మాత్రం అతనికి తీసిపోతారా?' విశ్వనాథరావు బాధపడ్డాడు.

పార్వతి తలంచినట్లు ఆ దుమారం వారం రోజుల్లో ముగిసింది. విశ్వనాథరావు మళ్లీ మామూలు మనిషి అయ్యాడు. రంగనాథానికి దూరంగా వుండాలని అని కట్టుదిట్టాలూ చేసుకున్నాడు.

ఎలాంటి తబ్బిబ్బు వచ్చినా ముందు నిన్ను సస్పెండ్ చేస్తానని బంట్రోతుని హెచ్చరించాడు. బజారులో ముఖ్యంగా స్నేహితులతో నడుస్తూ వుంటే వాడి భయం అతడ్ని వెంటాడేది.

★ ★ ★

ఏభయ్యో పడిలో పడిన విశ్వనాథరావుది అతి సామాన్యమైన జీవితం. మేం ఇద్దరం - మాకు ఇద్దరు అన్నట్లు అతనికిద్దరే సంతానం. పెద్దవాడు రామం రెండేళ్ళక్రితం బి.ఏ. పాసై ఈమధ్యనే ఏ.ఎస్.ఎమ్.గా చేరాడు. ఇంటికి అయిదు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు. రెండోది రజని. ఈ సంవత్సరమే బి.ఏ. పరీక్ష రాసి రిజల్టు కోసం ఎదురుచూస్తున్నది. వారి పెళ్ళిళ్ళు చేస్తే తమ బాధ్యతలు, విధ్యుక్తధర్మాలు నెరవేరినట్లే. రామం దూరాభారంలో వుంటున్నాడు. తిండికి బొత్తిగా సదుపాయం లేదు. వాడికి పెళ్లి చేయడం చాలా అవసరం.

రజని పెళ్లి కూడా చేయాలి. ఏనాడూ అధర్మంగా డబ్బు సంపాదించడానికి ఆశపడని విశ్వనాథరావు దగ్గర బ్యాంకు బేలన్సులు లేవు. వచ్చే జీతంరాళ్ళు బొత్తిగా భుక్తికే సరిపోతున్నాయి. నలభై వేలు కట్నం ఇస్తానంటేనేకానీ ఎవరూ పెళ్లిచూపులకు కూడా రావడంలేదు.

“నీకేం చింత విశ్వనాథం! కొడుకున్నాడుగా. వాడి పెళ్లిలో ఎలాగూ కట్నం దొరుకుతుంది. రజని పెళ్ళి నీకో సమస్యా?” అనేవారు కొందరు.

“ఆడపిల్ల ఉన్నది. ఆమాత్రం నిలువ చెయ్యకుండా వున్నావా? నువ్వు మొదటినుంచి రెవెన్యూ డిపార్టుమెంటులో పనిచేస్తున్నావు” అనేవారు మరికొందరు.

వాళ్ళలా అభిప్రాయపడడంలో పొరపాటు లేదు. ఆ విభాగంలో పనిచేసే బంట్రోతులూ స్వంత ఇళ్ళు కట్టుకుంటున్నారు. బోలెడు డబ్బు సంపాదిస్తున్నారు. తన నిజాయితీ గురించి చెప్పినా ప్రయోజనం లేదు. వీరు ఆర్చేవారా - తీర్చేవారా?

తనకీ ఊరిలో మిత్రత్వం కలిసినవారిలో తన శాఖవారు ఇద్దరు ముగ్గురున్నారు. వాళ్ళ దగ్గరా అబ్బాయిలున్నారు. స్నేహధర్మంగా తన రజనీని వీరెవరైనా తమ కోడలిగా చేసుకుంటే... తను యధాశక్తిగా ఎంతో కొంత కట్నం ఇస్తాడు. రామం పెళ్ళి ద్వారా కొంత కట్నం ఎలానూ వస్తుంది. విశ్వనాథరావు తన ఉద్దేశాన్ని భార్యకు చెప్పాడు. ఆమె అతనితో ఏకీభవించింది.

★ ★ ★

“ఏమండీ! రంగనాథం ఒక వింత మృగం, సభ్యత సంస్కారాలు లేనివాడు అన్నారే! అతడెంతో సహృదయుడని నాకనిపించింది. ఐతే కిందా మీదా చూడకుండా చాలా కలుపుగోలుగా మాట్లాడుతాడు” అంది పార్వతి.

“ఏమిటి? వాడు ఇల్లు వెతుక్కుంటూ మన ఇంటికి వచ్చాడా? పార్వతీ! వాడిని దూరంగా వుంచమన్నానే... వాడు చేసే ఉద్యోగం ఏమిటి? నేను చేస్తున్న ఉద్యోగం ఏమిటి? అతడ్ని మన స్నేహితుడని చెప్పుకుంటే మన పరువు గంగపాలౌతుంది” అన్నాడు విశ్వనాథరావు.

"చేసే ఉద్యోగాలనుబట్టి మనుషులను అంచనా వేయాలా? అతను చేస్తున్న చిన్న పనే కావచ్చు. కష్టపడి పనిచేస్తున్నాడు. మీలా నిజాయితీగానే బ్రతుకుతున్నాడు. మీరు అతనితో మనసు విప్పి మాట్లాడండి. ఎంతటి భోళామనిషో ఎంతటి సహృదయుడో మీకే అర్థం అవుతుంది. ఆ విషయాలకేం, మీ స్కూటర్నోమారు నడిపించి చూస్తారా?"

"స్కూటర్నా? అది ఎందుకూ పనికిరాకుండా పోయిందని నీకు తెలియదా? ఎందరు మెకానిక్కులకు చూపించినా లాభంలేదని పెదవి విరిచేశారే! అయినా కాటాకి అమ్మేయాలనుకుంటున్నాను"

"అందుకే అంటున్నాను. దీన్ని బాగుచేయడం మా తరం కాదని ఎందరో అన్నారే. అదిగో దాన్ని మీ బాల్యస్నేహితుడు రెండు గంటల్లో దార్లోకి తెచ్చాడు. 'చెల్లెమ్మా! మరో రెండేళ్ళ వరకు ఇది మరెలాంటి ట్రబుల్ ఇవ్వదు' అన్నాడు" అంది.

పార్వతి చెప్పింది అబద్ధం కాదు. రంగనాథంలో ఏం నేర్పు వుందో ఎందుకూ పనికిరానిదని ఆరు నెలలై మూలపడేసి వున్న స్కూటరు పంచకళ్యాణి గుర్రంలా పరిగెత్తింది.

"ఇంతకీ ఏం ఇవ్వమన్నాడు?"

"చూశారా! ఇప్పుడు మీరు అతను ఏదో ఎక్కువ డబ్బు గుంజుకున్నాడని అపోహపడుతున్నారు. రామ రామ! అతను నయాపైసా తీసుకోలేదు. 'స్నేహితుడి దగ్గర డబ్బులు తీసుకునే కక్కుర్తి లేదు చెల్లెమ్మా!' అన్నాడు.

'అన్నగారూ! మీరేవో పార్టులు తెచ్చివేశారే కనీసం వాటి డబ్బైనా ఇవ్వడం ధర్మం కాదా' అని నేనంటే 'అయ్యో! నేను మార్చిన పార్టుల ఖరీదు ఏమంత ఎక్కువ కాదు. పదో పదిహేనో, నాకవసరం వస్తే విస్సునడిగి అంతకన్నా ఎక్కువే తీసుకుంటాను' అన్నాడు' అంది పార్వతి.

రంగనాథం తన స్కూటర్ని ఫ్రీగా బాగుచేసినా అతను దగ్గరకు రావాలని ప్రయత్నించడం విశ్వనాథరావుకి కంటకంగానే ఉంది.

"వాడలా అన్నా ఓ ఇరవయ్యో పాతికో వాడి ముఖాన పారేయాలని నీకనిపించలేదా? ఒకరి డబ్బుకి మనమెప్పుడైనా ఆశపడ్డామా?"

పార్వతి బదులుచెప్పలేదు. "బజారునుంచి మిఠాయి తెప్పించావా? రంగనాథం వచ్చేడనేనా?" పార్వతి ప్లేటులో స్వీటూ హాటూ తెచ్చి ఇస్తే విశ్వనాథరావు అడిగాడు.

"ఇవి నేను తెప్పించినవి కావు. ఒట్టిచేతులతో మీ ఇంటికి ఎలా వచ్చేది చెల్లెమ్మా అంటూ మీ స్నేహితుడు తెచ్చి ఇచ్చినవి" అన్నది పార్వతి.

మాటిమాటికి ఆమె మీ స్నేహితుడు... మీ స్నేహితుడు అని అంటూ ఉంటే విశ్వనాథరావుకి అరికాలి మంట నెత్తికెక్కింది.

"చూడు పార్వతీ! ఇవన్నీ చూస్తుంటే అతను మనతో చెలిమి పెంచుకోవాలని అనుకుంటున్నట్లు న్నాడు. అందులో ఏదో దురూహ వుండిఉంటుంది" అన్నాడు కాస్త శాంతపడి.

విశ్వనాథరావు రంగనాథం అంటే ఎంత చీదరించుకుంటున్నాడో రంగనాథం అతనంటే అంత అభిమానం చూపెడుతున్నాడు. ఇతర మిత్రుల్లా ఇతను తినిపోవడం లేదు. వచ్చినప్పుడల్లా పండో కాయో తెస్తాడు. చివరకు కాఫీ అయినా పుచ్చుకోడు. మరి రావద్దని ఆమె అతడ్ని ఎలా వారించగలదు?

ఇది ఇలా వుండగా విశ్వనాథరావు రజనీకి సంబంధాలు చూడసాగేడు. సోమశేఖరానికో కొడుకు ఉన్నాడు. ఈమధ్యనే బ్యాంకులో జాబ్ దొరికింది. రజనీకి ఈడుగా ఉంటాడు. సోమశేఖరంతో బాగా పరిచయం ఉంది. తన మాట కాదనడు అనుకున్నాడు విశ్వనాథరావు.

"మీ అమ్మాయి రజనీని నేనూ నా భార్యే కాదు మావాడూ చూశాడు. ఆమెను చేసుకుందికి మాకెలాంటి అభ్యంతరం లేదు. మావాడికి ఏభైవేలు ఇస్తాం అని చాలామంది ముందుకి వస్తున్నారు. మీరు మాకు బాగా తెలిసినవారు. ఆ కట్నం మీరిచ్చేటట్లయితే అలాగే కానిద్దాం" నిర్మొహమాటంగా అన్నాడు సోమశేఖరం.

పదిహేను వేలదాకా అయితే అప్పో సప్పో చేసి రజనీ పెళ్ళి చేయాలనుకున్నాడు. ఏభైవేలు తన తాహతుకి మించినది. అతడ్ని పలువిధాల ప్రాధేయపడ్డాడు. ఇతర స్నేహితులచేత చెప్పించాడు.

"మీదంతా పిచ్చి. ఎక్కడైనా బావగానీ వంగతోటలో మాత్రం కాదు అన్న సామెత మీకు తెలియదా? బి.ఏ. పాసై బ్యాంకులో పనిచేస్తున్న కుర్రవాడికి ఆ కట్నం తక్కువే. మీరంతగా ఇవ్వలేకపోతే మరో సంబంధం చూసుకోండి"

మరొక మిత్రుడు. అతని పేరు భూపతి. వారి తాతలనాటి భూములుండేవి. ఇప్పుడు లేవు. ప్రభుత్వ ఉద్యోగం మాత్రం ఉంది.

"మావాడు స్కూలు ఫైనలు పాసయ్యాడు. వాడికేదైనా ఉద్యోగం వేయించి పదిహేను వేలు కట్నం మీరన్నట్లే ఇస్తే మీ రజనీని మావాడికి చేసుకుంటాం" అన్నాడు భూపతి.

విశ్వనాథరావుకి కోపం వచ్చింది కానీ అణచుకున్నాడు. బి.ఏ. చదివిన పిల్లను ఇంటరైనా చదవని తన కొడుక్కి చేసుకోమని అడగడానికి అతనికెలా మనసు వచ్చింది? ఉద్యోగం వేయించు కోవాలట. పైగా పదిహేను వేలు కట్నం.

★ ★ ★

విస్సూ! అమ్మాయికి పెళ్లి సంబంధాలు చూస్తున్నావట. ఏదైనా కుదిరిందా? అన్నట్లు నీ కొడుకు రామం గురించి ఆలోచించవేం? ఎంతకాలం వాడు చెయ్యి కాల్చుకుంటాడు?" అన్నాడు రంగనాథం.

విశ్వనాథరావు బదులు చెప్పలేదు.

"అన్నగారూ! ఆడపిల్లను ఇంట్లో ఉంచుకుని మగపిల్లాడి పెళ్లిమాట ఎలా తలపెట్టగలం? దీనికి సంబంధం కుదిరితే వాడికీ ఏదో చూసి చెయ్యాలనుకుంటున్నాం" అంది పార్వతి.

రంగనాథానికి పెళ్లీడుకొచ్చిన కూతురుందని ఆ దంపతులకు తెలుసు.

"మా సువర్చల అదృష్టవంతురాలు. దాని పెళ్లి నాకొక సమస్య కాదు" అన్నాడు రంగనాథం.

"ఏదైనా మేనరికం ఉందా?"

"చెల్లెమ్మా! మేనరికాలేం లేవు. నాకో మిత్రుడున్నాడు. నేను అడగాలే కానీ అతను కాదనడు. కట్నం అసలు పుచ్చుకోడు. నా భార్య తొందర పెడుతుంది. చీటికి మాటికి అతనింటికి వెళ్తారు. ఈ విషయం ఎత్తరేం అని" అన్నాడు రంగనాథం.

విశ్వనాథరావు గుండెల్లో రాయి పడింది. వీడు తన రామం గురించే ఆలోచిస్తున్నాడా? వాడి ఉద్దేశం అదే అయితే సోమశేఖరం తనకిచ్చిన జవాబే తనూ వీడికిస్తాడు.

పార్వతికి కూడా అలాంటి అనుమానమే కలిగింది. సువర్చలను కోడలిగా చేసుకోవచ్చు. అది సుతరాం తన భర్తకిష్టంలేదు. పైగా రామం పెళ్లి రజని పెళ్లితో లింకుపడింది. ఇటు వచ్చిన కట్నం అటు తిప్పాలనుకుంటున్నారు. రంగనాథం ఆ ప్రస్తావన తేకపోతేనే బాగుంటుంది అనుకుంది.

"విస్సూ! పెద్దగా కట్నం ఇచ్చుకోలేనని రజనీకి అన్యాయం చేయకు"

విశ్వనాథరావు కాళ్ళకు బలపాలు కట్టుకుని తిరిగి తిరిగి చివరకు ముప్పైవేల కట్నంతో రజనీ పెళ్లి నిశ్చయం చేశాడు. ఇక రామానికి ఏదో సంబంధం చూసి అంత కట్నం తీసుకుంటే రెండు పెళ్ళిళ్లూ ఒకేమారు చేయవచ్చుని భావించి రామాన్ని వెంటనే రమ్మని ఉత్తరం రాశాడు.

★ ★ ★

"నాన్నగారూ! నేను శ్యామలను ప్రేమించాను. ఆమెను తప్ప మరెవరినీ నేను ఏ పరిస్థితులలోనూ పెళ్లిచేసుకోను. ఆమె తండ్రి శంకరశాస్త్రిగారి స్థితిగతులు మీకు తెలుసు. ముప్పైవేలు కాదుకదా మూడువేలైనా ఇచ్చే స్థితిలో అతను లేదు. నాన్నగారూ! మీరు నామీద ఏవో ఆశలు పెట్టుకున్నారు. నిజమే, రజనీ పెళ్లి చేయడం మీకు కష్టమే. అలాగని నన్ను నేను మోసం చేసుకోలేను.

రజనీ పెళ్లి బాధ్యతలు మీ ఒక్కరివే కావు. అన్నదమ్ముడిగా నాకూ కొంత బాధ్యత ఉంది. ఈనాడు ఆర్థికంగా నేనేలాంటి సహాయమూ చేయలేను. ఆమె పెళ్ళికి తప్పక సహాయం చేస్తాను. మీరు అప్పుచేసి ఆ పెళ్లి జరిపించండి. ఆ అప్పు నేను తీరుస్తాను"

విశ్వనాథరావు స్థాణువే అయ్యాడు. పార్వతికిదంతా అయోమయంగా ఉంది. రామం ఇంత ఎత్తుకి ఎదుగుతాడని ఆమె ఊహించి వుండలేదు. అడ్డాలనాడు బిడ్డలుకానీ గడ్డాలనాడు కాదు అన్న సామెత తమపట్ల నిజమైంది. ఇప్పుడు దీనికి పరిష్కారం ఏమిటి? వాడి తల వంచి మరో పిల్లతో పెళ్లి చేయడం సాధ్యమా? అలా చేసినందున వాడూ సుఖపడడు, తామూ సుఖపడరు.

'నువ్వు నా కొడుకువి కావు. నీ ముఖం నాకు చూపించకు. తల్లిదండ్రులపట్ల చూపించవలసిన విధేయత ఇదేనా? ఇందుకేనా నిన్ను నవమాసాలు మోసి కని పెంచింది? ఇంతకాలం నిన్ను చదివించి నీ కాళ్ళమీద నీవు నిలబడేటట్లు చేశామే. ఇప్పుడు రెక్కలొచ్చాయని నీ దారి నీవు చూసుకుంటావా? మా పొట్లు మమ్మి పడమంటావా?' అని నిలదీసి అడిగినా ప్రయోజనం వుండదు.

తన కొడుకు పరిస్థితులను అర్థం చేసుకొని తనంత తానుగా ముందుకు రావాలిగానీ, వాడే తనకొక నిర్వాకం చేయబోతున్నట్లు చెప్తే వాడికి బోధపరచాలనుకోవడం దండగ.

ఆడపిల్లల పెళ్ళిళ్లు తల్లిదండ్రులకు సమస్యలే. తాము కాకపోయినా శంకరశాస్త్రిగారు అదృష్టవంతులు. శ్యామలను పెళ్ళిచేసుకుంటానని రామం ముందుకు వచ్చాడు. శ్యామల కూడా తమకు రజనీ లాంటిదే. తన పిల్ల పెళ్ళి కోసం శ్యామల పెళ్ళికి విఘ్నం కలిగించలేదు.

పార్వతి మనస్సాగర మథనం చేసింది. చివరకు అమృతమే వచ్చింది. రజనీ రాత ఎలాగుంటే అలా జరుగుతుంది. భర్తకు నచ్చ చెప్పింది. అబ్బాయితో పంతాలకు పోవద్దంది. వాడి అభీష్టప్రకారమే కానివ్వండని కోరింది.

ఒక పెళ్లికి అంకురార్పణ జరిగితే, వేరొక పెళ్లి బెడిసికొట్టింది. విశ్వనాథరావుకి చేబదులుగా అంత సొమ్ము జతపడలేదు. ఎందరినో అర్థించాడు. కాళ్లావేళ్లా పడ్డాడు. ఐనా ఫలితం లేకపోయింది.

విశ్వనాథరావు కొత్త మిత్రులు ఈ కారణంగా అతనికి దూరం అయ్యారు.

"చెల్లెమ్మా! నా పరిస్థితులు తెలుసుగా. నాదేమంత పెద్ద ఉద్యోగంకాదు. నేను మీకెలాంటి సహాయం చెయ్యలేకపోతున్నాను" అన్నాడు రంగనాథం. ఇప్పుడతనొక్కడే తరచు వస్తున్నాడు. విశ్వనాథ రావుకిప్పుడతనిపట్ల ఎలాంటి హేయభావం లేదు. విశ్వనాథరావు ఇప్పుడెవరితో సరదాగా మాట్లాడడం లేదు.

"ఒరేయ్! విస్సూ! నువ్వు అలా దివాలా తీసిన వాడిలా బాధపడాలా? ఒక్కొక్కప్పుడు పరిస్థితులు మనకనుకూలంగా ఉండవు. ఏటికి ఎదురీదవలసి వస్తుంది. ధైర్యం ప్రధానం. రజనీకి పెళ్లి కాదన్న వ్యధ ఎందుకు? చక్కగా చదువుకుంది. అవసరమైతే ఉద్యోగం చేసి తన కాళ్ళమీద తను నిలబడగలదు. కళ్యాణమొచ్చినా కక్కువచ్చినా ఆగదంటారు తెలుసా?" అన్నాడు రంగనాథం.

శుష్కవచనాలు. వాడి జాగాలో తనుంటే తనూ ఇలాగే అనేవాడు. ఎద్దుపుండు కాకికి నొప్పా?

"విస్సూ! నా మాట వింటావా? అసలు నేనంటే నీకు చిన్నచూపు. అందుకే ఇంతకాలం నా మనసులో మాట చెప్పలేదు. నువ్వు రజనీకి రామానికి పెళ్లి సంబంధాలు చూస్తున్నావు. అయితే మా ఆవిడ భల్లూకం పట్టు పట్టింది. మీతో వియ్యమందాలన్నది ఆమె కోరిక. నాతో రోజూ పోరే. మీరు అన్నగారితో అనలేకపోతే నేనే వెళ్లి మాట్లాడుతాను అంది" అన్నాడు రంగనాథం.

రామం శ్యామలను చేసుకుంటానని మొండికేశాడని ఇతగాడికి తెలియదా?

"అన్నయ్యగారూ! సువర్చలను మా రామానికివ్వాలని మీకుందని మాకు తెలుసు. కానీ ఏం ప్రయోజనం? వాడు శంకరశాస్త్రిగారి అమ్మాయిని తప్ప వేరొకరిని చేసుకోనన్నాడు" అంది పార్వతి.

"చెల్లెమ్మా! నాకా విషయం తెలుసు. అయినా నేను సువర్చల పెళ్ళి విషయం అనడంలేదు. మీకు చెప్పానే నా స్నేహితుడొకడున్నాడు. అతని కొడుక్కి మా సువర్చలనిస్తున్నాం. నేను మన రజనీ మాట అంటున్నాను. మా ఆవిడకు, కాదు మా ఇద్దరికీ రజనీని మా కోడలిగా చేసుకోవాలని ఉంది. విస్సుకి తగిన హోదా అయిన ఉద్యోగం నాది కాదని ఇంతకాలం ఆ మాట పైకి అనలేకపోయాను"

విశ్వనాథరావుకి వాడన్నది అర్థంకాలేదు. రంగనాథానికి ఒక కొడుకున్నాడన్న సంగతే తమకు తెలియదు. కొడుకు వున్నా వాడు తండ్రిలా ఏదో గ్యారేజీలో మెకానిక్ అయి ఉంటాడు. అందుకే వాడింతకాలం ఊరుకున్నాడు. చూస్తూ చూస్తూ ఈ సంబంధం ఎలా అంగీకరించగలడు. వాడన్నట్లు రజనీకి పెళ్ళి కాకపోతే ఉద్యోగం చేసి బ్రతుకుతుంది.

"అన్నయ్యగారూ! మీకో కొడుకున్నాడా? మాకా సంగతి తెలియదు. మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు?" అంది పార్వతి.

"ఎలా తెలుస్తుందమ్మా! ఎప్పుడైనా మీరు మా ఇంటికి వచ్చారా? ఉన్నాడో కొడుకు. బి.ఇ. చేశాడు. ఏ.ఇ.గా ఉద్యోగంచేస్తున్నాడు. నా కూతుర్ని ఒక స్నేహితుడికొడుక్కిచ్చి కట్నంఇవ్వకుండా పెళ్ళి చేయాలనుకుంటున్నాను. అలాగే నా కొడుక్కీ కట్నంతీసుకోకుండా పెళ్ళి చేయాలనుకుంటున్నాను మరి మీదేఆలస్యం. పెళ్లిచూపులతతంగం ఎప్పుడేర్పాటుచేస్తారో? మీకూ, రజనీకి మా అబ్బాయి నచ్చితేనే" అన్నాడు రంగనాథం. ఆ సమయంలో విశ్వనాథరావు ఏమనిఅనుకొని ఉంటాడో రాయడంలో అర్థంలేదు.

**(స్వాతి మాసపత్రిక ఏప్రిల్ 1997)**